సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహంగా ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు

స్థానిక జేఎన్‌టీయూ–గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో క్రికెట్ జట్లు సత్తా చాటుతున్నాయి.

- 8లో



ఫీడర్ అంబులెన్సుల సేవలు పెంచాలి

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఫీడర్ అంబులెన్సుల సేవల విస్తృతి పెంచాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఆదేశించారు.

- 8లో



ఉపాధ్యాయులకు ఊరట

పాఠశాలల్లో బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతర మొదటి, రెండవ వారాలకు సంబంధించి హుండీల ఆదాయాన్ని వనం గుడి వద్ద గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.15,23,000 వేలు, 8 గ్రాముల బంగారం, 60 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కె.ఎల్.సుధారాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌పై విచారణ



పాలకొండ మార్కెట్‌లోని షాపులను పరిశీలిస్తున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీలో గతంలో పనిచేసిన కమిషనర్ శివప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు గురువారం విచారణ జరిపారు. గతంలో ఆయన అక్రమ కుళాయి కనెక్షన్లు ఇచ్చారని, అనుమతుల్లేకుండా ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చారని, మార్కెట్‌లో ఉన్న నగర పంచాయతీకి చెందిన షాపుల రెన్యువల్స్‌లో అవకతవకలకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఆర్డీ తెలిపారు. అనంతరం మార్కెట్‌లో ఉన్న షాపులను పరిశీలించారు. అంతకుముందు ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట ప్రస్తుత నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఉన్నారు.

5న ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్ష

విజయనగరం ఫూల్‌బాగ్: జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్) ఈ నెల ఐదవ తేదీన(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కార్యాలయపు వెబ్‌సైట్ www. breap.gov.inలో పాఠశాల యూడైస్ కోడ్‌ను వినియోగించి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి సహకరించండి

- దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులపై దేవదాయశాఖ కమిషనర్‌తో చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్‌ను శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. గొల్లపూడిలోని కమిషనర్ కార్యాలయంలో గురువారం కలిశారు. నూతన భవన నిర్మాణంలో అన్నదాన మండపం, హోమశాల, క్యూ కాంప్లెక్స్ తదితర ఆలయ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, పనులు పూర్తిచేయడంపై చర్చించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఎంకేబీ శ్రీను ఉన్నారు.

గిరిజన ఇంట అటవీ పంట

- నరమామిడి బెరడు, కరక్కాయలు, కుంకుడుకాయలు, నల్లజీడి పిక్కల సేకరణలో నిమగ్నమైన గిరిజనులు
- గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్న జీసీసీ
- అదనపు ఆదాయం



లప్పటి గిరిజన గ్రామంలో అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

గుమ్మలక్ష్మీపురం:

అటవీ ఉత్పత్తులు చేతికందే వేళ... గిరిజన ఇంట ఆదాయపంట పండుతోంది. ఇంటిల్లపాది ఉదయం నుంచి పొద్దుపోయేవరకు కొండల్లోనే తిరుగుతూ అటవీ ఉత్పత్తులను సేకరించి జీసీసీకి, ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం గిరిజన గూడలన్నీ అటవీ ఉత్పత్తులతో కళకళలాడుతున్నాయి. మన్యంలో సీజన్ల వారీగా ఏదో ఒక అటవీ ఉత్పత్తి లభ్యమౌతూనే ఉంటుంది. వాటిని సేకరించి విక్రయించగా వచ్చిన డబ్బులతో అవసరాలు తీర్చుకుంటారు. ప్రస్తుతం మన్యంలోని అటవీ ప్రాంతంలో నరమామిడి చెక్క/బెరడు, కరక్కాయలు, కుంకుడు కాయలు, నల్లజీడి పిక్కలు విరివిగా లభ్యమవుతుండడంతో వాటిని సేకరించి విక్రయించే పనిలో గిరిజనులు నిమగ్నమయ్యారు. గిరిజనులు సేకరిస్తున్న నరమామిడి చెక్కలు కిలో రూ.18, కరక్కాయలు కిలో రూ.15, కుంకుడు కాయలు కిలో రూ.45, నల్లజీడి పిక్కలు కిలో రూ.12లు చొప్పున జీసీసీ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు పార్వతీపురం జీసీసీ డివిజనల్ పరిధిలో కరక్కాయలు 68,998 కేజీలు, నరమామిడి బెరడు 45,369 కేజీలు, నల్లజీడి పిక్కలు 4,988 కేజీలు, కుంకుడుకాయలు 16,307 కేజీల చొప్పున ఇప్పటి వరకు కొనుగోలు చేశారు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దనే కాకుండా, నేరుగా గిరిజన గ్రామాలకు జీసీసీ అధికారులు వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో గిరిజనులకు సమయం కలిసివస్తోంది. అదనపు ఆదాయం సమకూరుతోంది.

పార్వతీపురం జీసీసీ డివిజనల్ పరిధిలోని జీసీఎంఎస్‌ల వారీగా అటవీ ఉత్పత్తుల కొనుగోలు (కిలోల్లో) ఇలా...

అటవీ ఉత్పత్తి	గుమ్మలక్ష్మీపురం	పార్వతీపురం	సాలూరు
కరక్కాయలు	50,015	13,590	5,393
నరమామిడి బెరడు	37,924	2,500	4,945
నల్లజీడి పిక్కలు	400	473	4,115
కుంకుడు కాయలు	-	10,450	5,857



జీసీసీ అధికారులు కొనుగోలు చేసిన కరక్కాయలు, నరమామిడి బెరడు

నాణ్యమైన ఉత్పత్తులు..

మన్యంలో పండే అటవీ పంటలు నాణ్యమైనవి. పూర్తిగా సేంద్రియ, ప్రకృతి విధానంలో సాగుచేసినవే. అందుకే ఇక్కడ సీజనల్‌గా లభించే అటవీ ఉత్పత్తులకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం లభించే అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు జీసీసీతో పాటు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఇది గిరిజన రైతులకు కలిసివస్తోంది. గిట్టుబాటు ధర లభిస్తోంది.

కొనుగోలు లక్ష్యం రూ.4.26 కోట్లు



పార్వతీపురం గిరిజన సహకార సంస్థ పరిధిలో రూ.4.26 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నది ఈ ఏడాది లక్ష్యంగా నిర్దేశించాం. ఇప్పటివరకు రూ.27.40 లక్షల విలువైన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేశాం. జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ (విశాఖపట్నం) ఆదేశాల మేరకు గిరిజనుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీజన్ల వారీగా లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం. అటవీ ఉత్పత్తులను సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించి జీసీసీ పూర్వాభివృద్ధికి గిరిజన రైతులు తోడ్పాటునందించాలి.

– వి.మహేంద్ర కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం



అడవిలో సేకరించిన నల్లజీడి పిక్కలను ఆరబెడుతున్న టంకు గ్రామ గిరిజన మహిళ

విజయదుందుభి మోగిద్దాం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర

- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- ప్రజలకు సేవలందించేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకం
- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు:

రాష్ట్రంలో 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించి, జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. సాలూరు పట్టణం మెంటాడ వీధి కల్యాణమండపంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపాలిటీలో సచివాలయాల వారీగా నియమించిన వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్తలు, గృహసారథులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ముందుగా కన్వీనర్లు, గృహసారథులకు రాజన్నదొర అభినందనలు తెలిపారు. ప్రజలకు మరింత ఉత్తమ సేవలందించడమే కన్వీనర్లు, గృహసారథుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవడం, వారి సమస్యల పరిష్కార బాధ్యతలు తీసుకోవడం, నూతనంగా మంజూరైన పథకాలను వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు అందించడం తదితర అంశాలను డిప్యూటీసీఎం రాజన్నదొర కూలంకుషంగా వివరించారు. ప్రజల సమస్యలను సచివాలయ సమన్వకర్తల ద్వారా పార్టీ మున్సిపల్ కన్వీనర్ గిరిరఘుకు, నాయకులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని, దానిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇదే క్రమంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు, కుట్రలను తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు తెలపాలని పేర్కొన్నారు. కష్టపడుతున్న వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను ఈ నెల 11 నుంచి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గృహసారథులకు ఇచ్చే ప్రత్యేక కిట్‌లో ఉన్న సామగ్రి వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, నాయకులు, కౌన్సిలర్లు జర్జాపు ఈశ్వరరావు, గిరిరఘు, రాపాక మాధవరావు, గొర్లె మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



రామస్వామి వెండి మంటపం వద్ద ఎమ్మెల్యే బడ్డుకొండకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో ఈ నెల 18 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆలయ అధికారులకు సూచించారు. స్వామి వారి వార్షిక, తిరుక్కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని సీతారామస్వామిని గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఈఓ ప్రసాదరావుతో మాట్లాడి శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. రెండు రోజుల పాటు జరగనున్న శివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల సమన్వయంతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. శివరాత్రి రోజున బోడికొండ పర్వతంపై ఏటా నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా శిఖరదీపాన్ని వెలిగిస్తున్నామని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు చేయాలన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాల్సిందే



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఉగాది నాటికి ఇచ్చిన గృహ నిర్మాణ లక్ష్యం పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టంచేశారు. లక్ష్యాలు సాధించని వారిపై చర్యలు తప్పవన్నారు. పార్వతీపురం పట్టణ, గ్రామీణ ఇంజినీరింగ్ సహాయకులతో కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై గురువారం సమీక్షించారు. లక్ష్యాల సాధనలో అలక్ష్యం వహిస్తే సస్పెన్షన్‌కు గురి అవుతారన్నారు. ప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల గృహాలు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. జిల్లాకు 15 వేల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం ఉందని, ఇప్పటికీ 7,500 పూర్తయ్యాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. పది రోజుల్లో లక్ష్యాల సాధనకు ప్రయత్నించని వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్నా నిర్మాణాల్లో జాప్యం చేయడం తగదన్నారు. చక్కని ప్రదేశాల్లో పేదలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించిందని, ప్రతి స్థలం విలువ లక్షల్లో ఉంటుందని, రానున్న రోజుల్లో దాని విలువ మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ప్రగతి కనిపించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, తహసీల్దార్ శివన్నారాయణ, ఎంపీడీఓ జావేద్, గృహ నిర్మాణ సంస్థ డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌లోనే హాజరు

ముఖ ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) యాప్‌లోనే అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల హాజరు నమోదు కావాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు. ముఖ ఆధారిత హాజరుపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. పోలీస్, పంచాయతీ రాజ్, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలకు కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుపై మినహాయింపులేదన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. హాజరునమోదును డీడీఓలు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులన్నీ చెల్లింపు



వీరఘట్టంలో ఉపాధి హామీ సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

వీరఘట్టం: జిల్లాలో తలపెట్టిన ఆర్‌బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, సీసీ రోడ్లు, కల్వర్టు పనుల పెండింగ్ బిల్లులన్నీ త్వరలోనే చెల్లిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు పేర్కొన్నారు. వీరఘట్టంలో స్థానిక విలేకర్లతో గురువారం మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.149 కోట్లతో పనులు చేసేందుకు ప్రతిపాదించగా ఇందులో ఇంతవరకు రూ.115 కోట్ల విలువైన పనులు చేశామన్నారు. ఇందులో రూ.22 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. నిర్మాణాలు పూర్తయిన అన్ని పనుల బిల్లులు జనరేట్ చేయమని సిబ్బందిని ఆదేశించామన్నారు. కొద్ది రోజుల్లోనే అన్ని నిర్మాణాలు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టంచేశారు. జిల్లాలో 75 చెరువులను అమృత సరోవర్ పథకంలో అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ప్రతీ చెరువును రూ.2 లక్షలతో అభివృద్ధి చేసేందుకు ఆర్థికపరమైన ఆమోదం లభించిందన్నారు. జిల్లాలో 2.82 లక్షల జాబ్‌కార్డులు ఉండగా వీటిలో 1.69 లక్షల జాబ్‌కార్డుదారులకు పనులు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇంతవరకు వేతనదారులకు 85 లక్షల పని దినాలు కల్పించి వేతనాల రూపంలో రూ.172 కోట్లు చెల్లించామన్నారు. 15 లక్షల పనిదినాలను మార్చి నెలాఖరులోపు కల్పిస్తామని వివరించారు.

సిబ్బంది తీరుపై ఆగ్రహం

ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తున్న వీరఘట్టం ఏపీఓతో పాటు కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది తీరుపై డ్వామా పీడీ రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విక్రమపురం వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. మెజర్‌మెంట్స్ ఇవ్వకపోవడంతో వేతనదారులు తమకు తోచిన విధంగా పనులు చేస్తున్నారని, దీనివల్ల ప్రతి వేతనదారుడికి రోజుకు రూ.51ల నష్టం కలుగుతోందన్నారు. కార్యాలయానికి సకాంలో సిబ్బంది రాకపోవడంపై మండిపడ్డారు. ఇక్కడ నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారని, పని తక్కువ, సిబ్బంది ఎక్కువగా పేర్కొన్నారు.

నాగావళి నదిపై మరో వంతెన

- బలసలరేవు–ఇసుకలపేట మధ్య నిర్మాణం
- ఈ నెలాఖరులోగా శంకుస్థాపనకు సన్నాహాలు
- తీరనున్న 50 గ్రామాల ప్రజల కష్టాలు
- రూ.87 కోట్లు మంజూరుచేసిన ఆర్‌అండ్‌బీ శాఖ
- 560 మీటర్లు మేర వంతెన నిర్మాణం
- రెండు జిల్లాల ప్రజలకు మార్గం సుగమం



ఇసుకలపేట వద్ద సాగుతున్న రోడ్డు పనులు

రాజాం: విజయనగరం, శ్రీకాకుళం జిల్లా ప్రజల రాకపోకలకు వీలుగా నాగావళి నదిపై మరో వంతెన నిర్మించనున్నారు. రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలం వాల్తేరు గ్రామం వద్ద ఉన్న బలసలరేవు నుంచి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని ఇసుకలపేట రేవు మధ్య వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఏడాదిన్నరగా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. తాజాగా ప్రీ ఎస్టిమేట్ నిర్వహించి అవసరమైన నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగుల చొరవతో నిధులు మంజూరుకావడంతో వంతెన నిర్మాణానికి మార్గం సుగమమైంది. 50 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మధ్య ప్రయాణ దూరం తగ్గనుంది.

నెలరోజులుగా కొలతలు

నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి రూ.15 లక్షల ఎస్టిమేట్ సర్వేను కోస్టల్ ల్యాండ్ సర్వే ఏజెన్సీ నిర్వహించి, వంతెన నిర్మాణ ప్లానింగ్‌ను ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించింది. రూ.87 కోట్లు అంచనా నిధులు కోరింది. నిధులు మంజూరు కావడంతో ఆర్‌అండ్‌బీశాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్లాన్ ప్రకారం నదికి ఇరువైపులా రోడ్డు చదును చేయడం, పిల్లర్లకు అనువైన ప్రదేశాలను నిర్ధారిస్తున్నారు. రోడ్డు సౌకర్యం, భవిష్యత్ వినియోగం, సాయిల్ టెస్టు, నదిలో మట్టి నమూనాలు సేకరణ, ఎంత లోతులో గ్రావెల్ ఉందనే అంశాలుపై పూర్తి వివరాలు సేకరించామని, ఈ నెలాఖరులోగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా వంతెన పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయులు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే సంతకవిటి నుంచి ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రాంతాలకు రహదారి సౌకర్యం కలగడంతో పాటు రెండు జిల్లాలను కలిపేవారధిలా మారనుంది. సంతకవిటి మండలంలో నాగావళి నదిపై రెండో వంతెనగా లెక్కల్లోకి వస్తుంది. 560 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం కానుంది. 1998–99 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి అప్పట్లో రూ. 90 లక్షలు నిధులు కేటాయించి వదిలేయగా, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంతీయుల వంతెన కలను నెరవేర్చుతోంది. ఇక్కడ వంతెన నిర్మించాలంటూ 2017 నుంచి ఏడాదిన్నర పాటు వాల్తేరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు దీక్షలు చేసినా టీడీపీ పట్టించుకోకపోవడం శోచనీయం.



వాల్తేరు వద్ద సాగుతున్న వంతెన లైనింగ్ పనులు

అందరి సహకారంతో



ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. గతంలో అర్ధాంతరంగా ఉండిపోయిన వంతెనలు, రోడ్లు కూడా పూర్తిచేస్తాం. వాల్తేరు వద్ద బలసలరేవు వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేస్తాం. అందరి సహకారంతో వంతెన నిర్మాణం సాకారంకానుంది.

– కంబాల జోగులు, రాజాం ఎమ్మెల్యే

కష్టాలు తీరుతాయి..



ఇసుకలపేట నుంచి అటు శ్రీకాకుళం, ఇటు ఆమదాలవలస చాలా దగ్గర. మధ్యలో నాగావళి నది ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నరకయాతన పడేవారు. వంతెన నిర్మాణంతో ఆ కష్టాలన్నీ తీరుతాయి. మా గ్రామంతో పాటు పరిసర గ్రామాలు ప్రజలు, వంతెన సాధన కమిటీ తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– గురుగుబెల్లి స్వామినాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, వాల్తేరు

క్లుప్తంగా

డీలర్ నిర్వాకం


పలగర ఒకటవ నంబర్ డిపో వద్ద ఉన్న చంద్రన్న విలేజ్ మాల్ బోర్డు

బలిజిపేట: ప్రభుత్వం మారింది..అన్ని కార్యాలయాల వద్ద గతంలో ఉండే బోర్డులు మారాయి. మండలంలోని పలగరలో ఒకటవ నంబర్ రేషన్ డిపో వద్ద మాత్రం చంద్రన్న విలేజ్ మాల్ బోర్డునే డీలర్ కొనసాగించడం విశేషం. బోర్డును చూసేవారు ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారు. ఈ డిపోవద్దకు అధికారులు పర్యవేక్షణ నిమిత్తం పలు పర్యాయాలు వచ్చినప్పటికీ లోపల ఏముందో పరిశీలించారు తప్ప షాపువద్ద బోర్డు ఎందుకు ఇలా ఉందో పరిశీలించకపోవడం గమనార్హం. డీలర్ వీరాభిమానంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిని గమనిస్తే మంచిదని భావిస్తున్నారు.

160 లీటర్ల సారా పట్టివేత

- ఆటో, ద్విచక్రవాహనం సీజ్
- ఇద్దరిపై కేసు నమోదు


సారా స్వాధీనం చేసుకున్న పోలీసులు

సీతంపేట: సారా అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మండలంలోని వలగజ్జి సమీపంలో సీతంపేట పోలీసులు గురువారం పట్టుకున్నారు. పాలకొండ మండలం వోని గ్రామానికి చెందిన కె.శ్రీను, కె.ప్రవీణ్‌లు ఆటో, ద్విచక్రవాహనాలతో క్యాన్లలో 160 లీటర్ల సారా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. వాహనాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సారా వండినా, అక్రమరవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏనుగు దాడిలో ఆవుదూడ మృతి


దళాయిపేట గ్రామంలో ఏనుగు దాడి చేయడంతో మృతిచెందిన ఆవుదూడ

కొమరాడ: మండలంలోని దళాయిపేట గ్రామ పరిసరాల్లో గురువారం ఉదయం ఆవుదూడపై ఒంటరి ఏనుగు దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆవు దూడ అక్కడికక్కడే మృతిచెందిదని పాడి రైతు మంతిన కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఏనుగుల వల్ల పంటలు, మనుషులతో పాటు పెంచుకున్న పాడి పశువులను కూడా పోగొట్టుకోవాల్సివస్తోందని బాధితుడితో పాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఉత్సాహంగా ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు

- సీనియర్స్‌లో అవంతి-ఎ, జేఎన్‌టీయూ జీవీ, సీతం ఇంజినీరింగ్ కళాశాలల విజయం
- జూనియర్స్‌లో ఆర్‌కే జూనియర్ కళాశాల గెలుపు


అవంతి ఇంజినీరింగ్ కళాశాల సీతం కళాశాలల జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ-గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో క్రికెట్ జట్లు సత్తా చాటుతున్నాయి. రెండో రోజు పోటీల్లో సీనియర్ విభాగంలో అవంతి -ఎ కళాశాల, జేఎన్‌టీయూ జీవీ, సీతం ఇంజినీరింగ్ కళాశాలల జట్లు సాధించగా, జూనియర్ విభాగంలో ఆర్‌కే కళాశాల జట్టు విజయం సాధించింది.

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

అవంతి – ఎ ఏకపక్ష విజయం

సీనియర్ విభాగంలో గురువారం ఉదయం నిర్వహించిన తొలి మ్యాచ్‌లో అవంతి-ఎ జట్టు కోస్టల్ కళాశాల జట్టుపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన కోస్టల్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. అనంతరం 48 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అవంతి-ఎ జట్టు 3.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 48 పరుగులు చేసి విజయం సాధించింది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ హేమంత్‌కుమార్ 24 పరుగులు సాధించాడు.

సీతం జట్టు విజయదుందుభి

సీతం ఇంజినీరింగ్, అవంతి బి కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి సీతం జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ దిగిన అవంతి-బి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. అనంతరం 52 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సీతం ఇంజినీరింగ్ కళాశాల జట్టు 7 ఓవర్లలో కేవలం 2 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని చేరుకుంది. జట్టు బ్యాటర్ వినయ్ 26 పరుగులతో విజయానికి కృషి చేశాడు.

జేఎన్‌టీయూ జీవీ ఉత్కంఠ విజయం

జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల (రాజాం) జట్ల మధ్య మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఆఖరికి జేఎన్‌టీయూ జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన జీసీఎస్‌ఆర్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 92 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జేఎన్‌టీయూ జీవీ జట్టు ఆఖరి బంతికి ఫోర్ కొట్టి విజయాన్ని అందుకుంది. ఆ జట్టు టాపార్డర్ బ్యాటర్ హర్షిత్‌నాగ్ అర్ధసెంచరీ (52) చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

ఆర్‌కే జూనియర్ కళాశాల విజయం

జూనియర్ విభాగంలో మధ్యాహ్నం ఆర్‌కే జూనియర్ కళాశాల, వేదాంత జూనియర్ కళాశాల (పార్వతీపురం) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన వేదాంత జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆర్‌కే కళాశాల జట్టు 6 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి విజయాన్ని అందుకుంది.

నేటి మ్యాచ్‌ల వివరాలు

సీనియర్స్ విభాగం: (ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు)
అవంతి రీసెర్చ్ టెక్నో కళాశాల – గోకుల్ ఇనిస్టిట్యూట్ కళాశాల (బొబ్బిలి)
మిరాకిల్ – అవంతి ఫార్మసీ కళాశాల
జూనియర్స్ విభాగం: (మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు)
భాస్కర్ జూనియర్ కళాశాల –భరత్ జూనియర్ కళాశాల
శ్రీనివాస జూనియర్ కళాశాల (చీపురుపల్లి)–మ్యాచ్–1 విన్నర్ (ఆర్‌కె జూనియర్ కళాశాల)


విజయం సాధించిన ఆర్‌కే కళాశాల జట్టు


సీతం ఇంజనీరింగ్ కళాశాల జట్టు విజయనాదం


విజయోత్సవంలో అవంతి- ఎ కళాశాల జట్టు


విజయం సాధించిన జేఎన్‌టీయూ జీవీ కళాశాల క్రీడాకారులు

ఫీడర్ అంబులెన్సుల సేవలు పెంచాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్


సిబ్బందితో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఫీడర్ అంబులెన్సుల సేవల విస్తృతి పెంచాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక గిరిమిత్ర సమావేశం మందిరంలో ఫీడర్ అంబులెన్సుల సేవలపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీడర్ అంబులెన్సులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మ్యాప్ చేశారని, ఆయా పీహెచ్‌సీలకు అనుబంధంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య సేవల కోసం ఫోన్‌కాల్ వచ్చిన నిర్దేశిత సమయంలో బాధితుల సేవలకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. తక్షణం సేవలను అందించి ఆదర్శంగా ఉండాలని హితవు పలికారు. గిరిజనులకు అవసరమైన సేవలను అందించాలని, వారి ప్రాణాలతో చెలగాటమాడ వద్దని, అన్ని ఫీడర్ అంబులెన్సులు పూర్తిస్థాయిలో పనిచేయాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. వైద్య సేవల కొరతరానీయకూడదని కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోనే ఆరోగ్యమిత్ర మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య వెంకటలక్ష్మి

భామిని: మండలంలోని ఏటంగూడకు చెందిన గిరిజన యువకుడు, ఆరోగ్యమిత్ర బిడ్డిక వెంకటరమణ(46) గురువారం సీతంపేట ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ అకస్మికంగా మృతి చెందాడని మృతుని భార్య బిడ్డిక వెంకట లక్ష్మి విలపిస్తూ తెలిపింది.సీతంపేట సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రగా విదులు నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడని, వెనువెంటనే వైద్య సేవలు అందిస్తుండగా మృత్యువాత పడినట్లు చెప్పింది. ఆరోగ్య శ్రీ పథకం అమలవుతున్న నాటి నుంచి సీతంపేట, కొత్తూరు, భామిని ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న బిడ్డిక వెంకటరమణ(46)మృతిని వైద్య సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మితో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దాసరి సూరప్పడు (ఫైల్)

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్ల మండలం గోషాడ గ్రామానికి చెందిన దాసరి సూరప్పుడు(30) మృతిచెందాడు. సూరప్పుడు పల్లిగండ్రేడులోని అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పల్లిగండ్రేడు జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడ్డాడు. ప్రమాదంలో సూరప్పుడు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై జి.శిరీష చెప్పరు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష పేర్కొన్నారు.

కాలు జారిపడి మరొకరు..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని పాత గరివిడి ప్రాంతంలో అక్కివరపు ఆదినారాయణ(48) అనే వ్యక్తి కాలు జారి పడిపోయి సంఘటనలో మృతిచెందినట్లు ఎస్సై బి.మురళి తెలిపారు. మృతుని సోదరుడు అక్కివరపు రాజు ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ నాలుగేళ్లుగా పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఎడమ కాలు, ఎడమ చెయ్యి చచ్చుబడి ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లోనే కాలు జారి టీపాయి మీద పడిపోవడంతో టీపాయి గాజు పెంకు గొంతులో గుచ్చుకుని విపరీతమైన రక్తస్రావం జరిగింది. వెంటనే చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ముగ్గురు గంజాయి అమ్మకందారుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో యువకులకు చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని ప్యాకింగ్‌లు చేసి కళాశాల విద్యార్థులు, యువకులకు అమ్మకాలు చేస్తున్న రుక్మిణి, షేక్ ఖురేషి అనే మహిళలతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు ఘడ్‌కి చెందిన శేఖర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి 300 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కోళ్ల ఫారం దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో గ్రామానికి చెందిన గుంట్రెడ్డి సురేష్ కోళ్ల ఫారంలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కోళ్ల ఫారంలో షెడ్‌తో పాటు కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయాన్ని పార్వతీపురం అగ్నిమాపకశాఖ సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. జీవనోపాధికోసం అప్పుచేసి కోళ్ల వ్యాపారం చేస్తే ఇలా జరగడంతో ఎలా జీవించాలని సురేష్ కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు పరిశీలించి తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి

- డీఎస్పీ ఎ. సుభాష్


విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ ఎ.సుభాష్

పార్వతీపురం టౌన్: విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తిచూపి భవిష్యత్‌లో మంచి స్థానానికి చేరుకోవాలని డీఎస్పీ ఎ.సుభాష్ పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి తైక్వాండోపోటీల్లో పతకాలను సాధించిన అనిల్ శర్మ అకాడమీ విద్యార్థులను గురువారం తన క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో మంచి పతకాలను సాధించి పార్వతీపురం మన్యం జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. 64కేజీల విభాగంలో ఎస్.జతీష్, బి. దేవేష్‌లు బంగారు పతకాలు, సీహెచ్ అనంత్ 55కేజీల విభాగంలో వెండి పతకం, బాలికల విభాగంలో హర్షితశర్మ వెండిపతకం సాధించడం ఆనందంగా ఉందని ప్రశంసించారు. ఈ నెల 3,4,5 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జాతీయస్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనిల్‌శర్మ, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

భూసేకరణపై సమావేశం


పరిహారం మంజూరుపై చర్చిస్తున్న కమిటీ

పూసపాటిరేగ: రామతీర్థసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ నిర్మాణానికి భూసేకరణకు సంబంధించి పరిహారం మంజూరు చేయడానికి పూసపాటిరేగలో రైతులతో గురువారం సమావేశం జరిగింది. భూసేకరణ నిమిత్తం నియమించిన కమిటీ సభ్యులు రైతులతో సమావేశమై రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ధర ఎంత ఉందని అడిగారు. జాతీయరహదారిని ఆనుకుని భూములు ఉండడంతో పరిహారం పెంచాలని రైతులు కమిటీని కోరారు. జిల్లా రిజిస్ట్రార్ ఎం.సృజన, రామతీర్థసాగర్ ఈఈ తిరుపతిరావు, అర్అండ్‌బీ ఈఈ రమణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొరతో కూడిన కమిటీ కాలువ నిర్మాణానికి సంబంధించిన భూములలో పర్యటించి రైతులతో మాట్లాడింది. ఈ సందర్భంగా రైతులు తెలియజేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు, రౌతు సత్తిబాబుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

స్పందన వినతులను 24 గంటల్లో ఓపెన్ చేయాలి


మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: స్పందన లాగిన్‌లో వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు 24 గంటల్లో ఓపెన్ చేసి చూడాలని అలా చూడని వారిపై క్రమశిక్షణ రాహిత్యంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఓ ఎం.గణపతిరావు హెచ్చరించారు. గురువారం తన చాంబర్‌లో స్పందన ఆడిట్ టీమ్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. స్పందన కార్యక్రమాన్ని నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారని తెలిపారు. అధికారులు స్పందన లాగిన్‌లో వచ్చిన దరఖాస్తు తన పరిధిలో ఉంటే ఎస్ అని క్లిక్ చేసి ఎంక్వైరీ అధికారికి పంపాలని వివరించారు. తన పరిధిలో కానిదైతే నో క్లిక్ చేసి స్పందన టెక్నికల్ టీమ్‌కు ఆన్‌లైన్‌లో పంపాలని తెలిపారు. అదేవిధంగా పరిష్కరించే అధికారి ఎంక్వయిరీ రిపోర్ట్, ఫొటోను సరి చూసుకోవాలన్నారు. స్పందన పరిష్కారంపై పిటిషన్‌దారు అసంతృప్తి వ్యక్తం చేస్తే జిల్లా స్థాయి ఆడిట్ కమిటీ విచారణ చేసి మళ్లీ రెడ్రెస్సల్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, సీపీఓ బాలాజీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

20లోగా మాజీ సైనికులు ఇళ్ల స్థలాల పట్టాలు తీసుకురావాలి

గాజులరేగ సర్వే నంబర్ 1లో ఇంటి స్థలాలకు పట్టాలు పొందిన మాజీ సైనికులు, తమ వద్దనున్న ఆధారాలను ఈ నెల 20వ తేదీలోపు విజయనగరం ఆర్‌డీఓకు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ సర్వే నంబర్‌లోని 15 ఎకరాల కొండపోరంబోకు భూమిలో, 352 మంది మాజీ సైనికులకు ఇళ్ల స్థలాల పట్టాలను 2009లో అప్పటి తహసీల్దార్ మంజూరు చేశారని దానిని సబ్ డివిజన్ చేసి తమకు అప్పగించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. అందువల్ల పట్టాలు పొందిన వారంతా వ్యక్తిగతంగా హాజరైన తమ ఒరిజనల్ పట్టా, తాము మాజీ సైనిక ఉద్యోగులు లేదా వితంతువులని ధ్రువీకరిస్తూ ఇతర ఆధారాలను ఈ నెల 20వ తేదీలోగా ఆర్‌డీఓ కార్యాలయానికి సమర్పించాలని కోరారు.

ఉపాధ్యాయులకు ఊరట


గరుగుబిల్లి పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

పార్వతీపురం: పాఠశాలల్లో బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ పథకాల పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించింది. ఈ బాధ్యతలను వైఎస్‌ఆర్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఏపీఎంలకు అప్పగించింది. అలాగే బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించకూడదని తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గి మెరుగైన బోధనను అందించేందుకు అవకాశం ఉంటుంది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన జగన్ సర్కార్ ఇప్పటికే 'నాడు-నేడు' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలనే మార్చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. ప్రైమరీ నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక, బడిలోని మరుగుదొడ్ల పరిశుభ్రత, ఏటా కనీస మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల విడుదల, నూతన జాతీయ విద్యావిధానం అమలు, టీచర్లకు తరచూ శిక్షణ, ఆన్‌లైన్, డిజిటల్ పాఠాలు ఇంకా పలు రకాల కార్యక్రమాలు విద్యాశాఖ అమలు చేస్తోంది. అయితే అర్హత ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో కొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కొన్ని పథకాలకు దూరమవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటిని సరి చేయడానికి, బోధనేతర పనులకు టీచర్లు తమ విలువైన సమయాన్ని వెచ్చిస్తున్నారని, ఇది బోధనపై ప్రభావం చూపుతోందని భావించింది. ఈ నేపథ్యంలో వివిధ పథకాల పర్యవేక్షణ బాధ్యతలను ఇక నుంచి వైఎస్ ఆర్ క్రాంతిపథం ఏపీఎంలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మండలానికి ఒకరికి శిక్షణ

పార్వతీపురం మన్యం జిల్లాలో 1333 ఎంపీపీ, 158 యూపీ, 231 జెడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న 80,746 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ బాధ్యతలు ఉపాధ్యాయులపై పెట్టకూడదని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలోనే వెలుగులో పనిచేస్తున్న ఏపీఎంలకు పాఠశాలల్లో పథకాల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. మండలానికి ఒకరు చొప్పున ఎంపిక చేసి ఇటీవల జిల్లాలో పనిచేస్తున్న ఏపీఎంలకు పార్వతీపురంలో రెండురోజులు శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం ఏపీఎంలే పథకాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకున్నారు. వారంతా ఆయా మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో విధులు నిర్వర్తించనున్నారు.

ఏపీఎంల విధులు ఇలా..

'అమ్మ ఒడి' పథకం కోసం అర్హులైన విద్యార్థుల తల్లులను గుర్తించడం.
- బడి బయట ఉన్న విద్యార్థులను స్కూల్లో చేర్పించడం.
- బడిలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై రోజూ ఫొటోలు తీసి సంబంధిత అధికారులకు పంపడం.
- డిజిటల్, ఇంటర్నెట్ పరికరాల నిర్వహణ, వాటి భద్రత
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశాలకు వెళ్లి పాఠశాలలో అమలవుతున్న పథకాల లోటుపాట్లను తెలియజేయడం.
- జగనన్న గోరుముద్దపై ప్రత్యేక దృష్టిసారించడం.
- తాగునీటితో పాటు మల, మూత్రశాలల్లో నీటి వసతికి ఆటంకం కలగకుండా చూడడం.
- బాలల, ఉపాధ్యాయ, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయడం.
- పిల్లల విద్య, వైద్య, రక్షణకు సంబంధించిన అంశాలను రోజువారీ పర్యవేక్షించడంలాంటి బాధ్యతలను ఏపీఎంలకు ప్రభుత్వం అప్పగించింది.

ఏపీఎంల సహకారం తీసుకుంటాం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాయి. ఆ పథకాల అమలు, పర్యవేక్షణకు డీఆర్డీఏలో పని చేస్తున్న ఏపీఎంల సహకారం తీసుకుంటాం. దీంతో ఉపాధ్యాయులకే కాకుండా విద్యాశాఖలో పని చేస్తున్న ఇతర అధికారులకు కూడా పని భారం తగ్గుతుంది.
– ఎస్‌డీవీ.రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా